




భవిష్యత్తులో ఒక రోజు...

విశ్వాంతరాళాన్ని ఛేదించుకుంటూ వెలుగు చుక్కలా ప్రయాణిస్తోంది ఒక అంతరిక్ష నౌక.

కంట్రోల్స్ దగ్గర ఉన్న వ్యక్తి పేరు గౌతమ్.

అతడి పక్కనే నిలబడి స్క్రీన్ మీద కనిపిస్తున్న దృశ్యాలను పరీక్షగా చూస్తోంది ఒక యువతి.

ఆమె అతడి భార్య అశ్విని.

స్క్రీన్ మీద, వాళ్ళు సమీపిస్తున్న ఉపగ్రహం స్వరూపం యిప్పుడు స్పష్టంగా పెద్దగా కనిపిస్తున్నది.

"అశ్వనీ! గెట్ రెడీ!"....

ఇద్దరూ జాగ్రత్తగా కంట్రోల్స్‌ను నియంత్రించసాగారు...

అంతరిక్షనౌక వేగం తగ్గిపోయి, గ్రహానికి దగ్గర కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఇప్పుడు నౌక నుండి చిన్న లాండింగ్ క్రాఫ్ట్ విడివడి, ఉపగ్రసం మీదకు దిగటం స్క్రీన్ మీద కనిపిస్తున్నది.

కొద్దిసేపటి తర్వాత లాండర్‌తో పాటు దిగిన ఒక 'రోబోటిక్ రోవర్' గ్రహం ఉపరితలం మీద తన అన్వేషణ మొదలు పెట్టింది. ఉపరితలం నుండి శిలలు, ధూళి శాంపిల్స్ సేకరించడానికి, దానికి మెకానికల్ హాండ్స్, స్టీరియోస్కోపిక్ విడియో కెమేరా విజన్, పవర్ సప్లయికి ఒక రేడియో ఐసోటోప్ థెర్మో ఎలక్ట్రిక్ జనరేటర్ ఉన్నాయి.

లాండింగ్ క్రాఫ్ట్‌లోని పరికరాలు ఆ ప్లానెట్ గురుత్వాకర్షణ శక్తి, సాయిల్ స్ట్రక్చర్, మాస్ గురించిన వివరాలు మదర్ షిప్‌కు పంపసాగాయి. గౌతమ్, కంప్యూటర్‌కు ఫీడ్ చేయబడుతున్న ఆ వివరాలను పరీక్షగా చూస్తూ తృప్తిగా తల పంకించాడు.

అశ్విని ఒక బటన్ నొక్కింది.

సెకను కన్న తక్కువ వ్యవధిలో శక్తివంతమైన లేసర్ బీమ్, ప్లానెట్ ఉపరితలాన్ని తాకి చిన్న వాయు మేఘం పైకి లేచింది. మరొకవైపు నుండి ఛార్జ్‌డ్ పార్టికల్స్ బీమ్ ఒకటి ఉపరితలం మీద యాన్స్‌ను చెదరగొట్టింది.

మదర్ షిప్‌లోని మాస్ స్పెక్ట్రోమీటర్ మొదలైన ఆధునిక పరికరాలు వాయు మేఘాన్ని, అయాన్స్‌ను పరీక్షించి గ్రహ నిర్మాణంలోని మూల పదార్థాల అన్వేషణకు ప్రయత్నించసాగాయి.

గౌతమ్ ప్రశంసగా అశ్విని వంక చూసాడు.

వారికి నిర్దేశించబడ్డ పనిలో దాదాపు సగం ముగిసినట్టే.

మరొక రోజు పాటు వాళ్ళు డేటా సేకరిస్తూ అక్కడే గడపాల్సి ఉంది.

"అశ్వనీ!"...

రెండడుగులు వేసి ఆప్యాయంగా భర్త భుజం మీద చెయ్యి వేసింది.

ఆ స్పర్శలోని ఆర్ద్రత అతడికెంతో హాయినిస్తోంది.

ఇద్దరూ దగ్గరే ఉన్న సోఫాలో కూర్చున్నారు.

గౌతమ్ అశ్విని ఒళ్ళో తల వాల్చాడు.

ఆమె భుజం మీదుగా కిందికి జారిన గాఢ తిమిరం లాంటి జుట్టు అతడి ముఖానికి పట్టుతెరలలాగా సోకుతున్నది.

భర్త నుదిటి మీద చేతి వేళ్ళతో మృదువుగా రాస్తూ ఆలోచనల్లో పడింది అశ్విని. 'తలుచుకుంటే ఈ జీవితం ఆమెకెంతో ఆశ్చర్యంగా అనిపిస్తున్నది. ఎందుకంటే, ఎక్కడో ఆంధ్రదేశంలో పుట్టిన వాళ్ళు మార్షియన్ సొసైటీలో సభ్యులై గెలాక్సీలో సంచారం చేస్తుంటారని వాళ్ళు కలలో కూడా ఊహించి ఉండకపోవచ్చు.'

కాని ఒకరకంగా యిందులో పెద్దగా ఆశ్చర్యపడాల్సిన పనేమీ లేదు. 21వ

శతాబ్దం తొలి దశలోనే! స్పేస్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందింది. గ్రహాంతర యానం అభివృద్ధి చెందింది. అదే టైములో పారలల్‌గా భూమి మీద మతి తప్పిన అణ్వాయుధాలు, లోపభూయిష్ఠమైన న్యూక్లియర్ రియాక్టర్స్, విష వాయువులు వాతావరణాన్ని మరింత కలుషితం చేసాయి. అట్టి పరిస్థితుల్లో హెల్దీజనరేషన్స్ కోసం, భూమి తిరిగి కోలుకోవటం కోసం, ప్రజలు యితర గ్రహాలకు వలస అనివార్యంగా చాలా దేశాలు భావించాయి. యిందుకు తగిన మేధావుల బృందాలను ఎంపిక చెయ్యటానికి ఒక అంతర్జాతీయ కమిటి ఏర్పడింది. అయితే యిందులో కూడా తల దూర్చటానికి, ఇండియా నుంచి, ఓట్లు కొనే రాజకీయవేత్తలు, కులగజ్జిగాళ్ళు, రికమండేషన్‌గాళ్ళు కొంత మంది ప్రయత్నాలు చేసారు. కాని వాళ్ళకు తగ్గిన అర్హతలు లేకపోవటం, దానికితోడు ఈ ప్రయత్నాలలో సుఖాల కన్నా కష్టాలే ఎక్కువగా ఉంటాయని అర్థమై వాళ్ళు వెనక్కితగ్గి శిథిలమై పోగా మిగిలిన దేశాన్ని దోచుకు తినే కార్యక్రమంలో నిమగ్నమైపొయ్యారు.

మొదట్లో కొన్ని ఒడిదుడుకులు ఎదురైనా, తరువాత పనులు చక చక జరిగిపొయ్యాయి.

మొదటిదశలో చంద్రుడికి దగ్గరగా లూనార్ కాలనీలు ఏర్పడ్డాయి. వీటి నిర్మాణంలో చాలావరకు చంద్రుడి మీద నుండి మైనింగ్ చేసి తియ్యబడ్డ అల్యూమినియం, టైటానియం, సిలికాన్ సిలింద్రికల్ షేపుల్లో ఉండి పెద్ద పెద్ద మిర్రర్స్ ద్వారా 24 గంటలు సూర్యరశ్మి లభించే ఏర్పాటు చెయ్యబడ్డాయి. ఎలక్ట్రిసిటీ కోసం సోలార్ పవర్ స్టేషన్, స్పేస్ షటిల్స్, దిగటానికి డాకింగ్ ఫెసిలిటీస్ ఏర్పడ్డాయి. భూమి నుండి తెచ్చిన లిక్విడ్ హైడ్రోజన్‌ను లూనార్ సర్ఫేస్ నుండి లభించిన ఆక్సిజన్‌తో కలిపి నీరు తయారు చేసుకున్నారు.

రెండవ దశనాటికి భారత దేశం నుండి పంపించబడ్డ బృందంలో గౌతమ్, అశ్విని ఉన్నారు. వీళ్ళను 'మార్స్'కు దగ్గరగా నిర్మాణదశలో ఉన్న కాలనీలలో పని చెయ్యటానికి పంపించారు. వీళ్ళందరి కృషి ఫలితంగా 20వ శతాబ్దపు మానవుడి కలలు ఫలించి ఎన్నో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. వీటిల్లో పని చేస్తున్న వివిధ దేశాల యువతీ యువకులు వివాహాలు చేసుకొని నూతన అంతరిక్ష నాగరికతకు నాంది పలికారు.

జరిగినదంతా ఆలోచిస్తుంటే అశ్వనికి ఎంతో విచిత్రమనిపిస్తోంది. 'తాము మార్షియన్ కాలనీకి వచ్చి అప్పుడే 15 సంవత్సరాలు దాటుతోంది?'

'అశ్వనీ! ఏమిటి ఆలోచిస్తున్నావ్?.... పిల్లలు గుర్తుకొచ్చారా?'...

"గౌతమ్!...

ఈ జీవితాన్ని ఎన్నుకున్న తరువాత పిల్లల ముద్దు ముచ్చట్లను గురించి ఆలోచించే అవకాశమే ఉండటం లేదు. అయినా, మార్షియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ భావి పౌరుల బాధ్యతను స్వీకరించిన తరువాత నాకెటువంటి చింతా లేదు"...

ఒక్క క్షణం ఆగి,

"తమ్ముడి నుండి మెసేజ్ వచ్చింది.

భూమి మీద ఆపర్చ్యూనిటీస్ సరిగా లేవుట. మన దగ్గరకు రావటానికి వీలుంటుందేమోనని అడిగాడు."

గౌతమ్ నిట్టూర్చాడు.

"అశ్వనీ!... 20వ శతాబ్దంలో మన పూర్వీకులు అమెరికా వెళ్ళటానికి తహతహలాడే వారుట. యిప్పుడు 'మార్స్'కు డిమాండ్ పెరిగింది.

అయినా మనచేతిలో ఏముంది?...

ఇంటర్నేషనల్ కమిటి సెలక్షన్‌లో అతడి క్వాలిఫికేషన్స్, మెడికల్ ఫిట్‌నెస్ సరిపోవాలి. దానికితోడు మార్షియన్ సొసైటీ యిప్పుడు కొత్త వాళ్ళను ఎక్కువగా అనుమతించటం లేదు. ఒకవేళ సెలక్షన్‌లో అతడు నెగ్గితే లూనార్ కాలనీస్‌లో ఏదైనా అవకాశం లభించవచ్చు. తరవాత చిన్నగా యిక్కడికి ప్రయత్నం చేసుకోవాలి."

దూరంగా ఒక ఉల్కా గ్రహం ఉపరితలం మీద వెలుగులు చిమ్ముతూ పతనమైంది.

స్పేస్ షిప్‌కున్న ట్రాన్స్‌పరెంట్ డోమ్ ద్వారా ఆ దృశ్యాన్ని చూసిన గౌతమ్, లేచి రోబోట్ ఉనికి గురించి స్క్రీన్ మీద పరిశీలనగా చూశాడు.

అది తనపనిలో నిమగ్నమై కనిపించింది.

యిటువంటి ఎక్స్‌ప్లోరేషన్స్‌లో అప్పుడప్పుడు ఉల్కాపాతాల వల్ల పరికరాలు ధ్వంసమైపోవటం వారికి పరిపాటే.

"గౌతమ్! ఎంత ప్రయాణించినా తరగని ఈ శూన్యాంధకారంలో యింకా ఎన్నెన్ని కొత్త సంగతులు దాక్కున్నాయో?...

భగవంతుడి సృష్టిఅపూర్వం కదూ!"...

గౌతమ్ ముఖంఅప్రసన్నంగా పెట్టాడు.

"అశ్వనీ! ఇండియాను, భూమిని శాశ్వతంగా వదిలి పెట్టేసిన తరువాత కూడ నీకింకా పాత భావాలు వదల్లేదు. ఇవన్నీ సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లేని వాళ్ళు అనాల్సిన మాటలు. ఆ రోబోట్‌లాగే మానవుడు కూడ ఒక విధమైన యంత్రం. దానిలాగే మానవ యంత్రం కూడ ఎప్పుడోప్పుడు చెడిపోయి ఆగిపోతుంది. దాన్నే నువ్వు మరణమనుకో లేక ఇంకేదన్నా పేరు పెట్టుకో. అంతే కాని దేవుడు, సృష్టి... ఈ మాటలన్నీ ఉత్త ట్రాష్!".... అవేశంగా అన్నాడు.

"గౌతమ్!...

భగవద్గీత పేరు నువ్వు వినే ఉంటావ్...

20వ శతాబ్దంలో ఘంటసాల అనే అమర గాయకుడు తనగాన మాధుర్యంతో భగవద్గీత శ్లోకాలకు జీవం పోసాడు. మార్షియన్ సొసైటీకి వస్తూ నేను వెంట తెచ్చుకున్న వాటిల్లో భగవద్గీత కాసెట్ కూడ ఉంది. భగవద్గీత నువ్వొకసారి చదివితే బాగుంటుంది.

"అశ్వనీ!... మతం మత్తులాంటిది. మతం ముసుగులో భూమి మీద రక్తపు టేరులు పారిన సందర్భాలెన్నో ఉన్నాయి. అందువల్లనే స్పేస్ కాలనీలో మతానికి సంబంధించిన గుర్తులేవీ ఉండకూడదని చట్టం చేశారు."

చిన్నగా నిట్టూర్చింది అశ్వని.

గౌతమ్ భావాలు మొదటి నుండి అంతే. కరుడు గట్టిన సైంటిస్టులా భౌతికవాదానికే ప్రాముఖ్యత యిస్తాడు.'

"గౌతమ్!... ఈ విశ్వాంతరాళంలో గ్రహాలు, ఉపగ్రహాలు, నక్షత్రమండలాలు యివన్నీ ఏదో ఒక సూత్రానికి, పరిమితికి లోబడి పని చేస్తున్నాయి కదా. వీటన్నిటినీ నడిపించే శక్తే దేవుడు కాకూడదా?"...

కొడపనేని శంకరరావు
అసుర పర్వం కథ
వచ్చే సంచికలో..

గౌతమ్ ఆమెతో మాటలు పెంచటం యిష్టం లేనట్టు ఆమెకు దూరంగా వెళ్ళి రొబోటిక్ రోవర్‌కు నావిగేషనల్ యిన్‌స్ట్రక్షన్స్ పంపసాగాడు.

ఒక రోజు గడిచింది.

వాళ్ళ మిషన్ పూర్తయి, సేకరించిన డేటాతో స్పేస్ షిప్ తిరుగు ప్రయాణం మొదలు పెట్టింది.

యిక కొన్నాళ్ళు వాళ్ళిద్దరికీ వెకేషన్.

అశ్వని మనస్సు పిల్లల మీదకు మళ్ళింది.

'ఈ వెకేషన్‌లో వాళ్ళను భూమికి తీసుకెళ్ళాలి. ఈ మధ్యనే తన తండ్రి పంపిన కాస్మోగ్రామ్‌లో పిల్లలందర్నీ చూడాలనిగాశాడు. వీలైతే లూనార్ కాలనీలో ఉన్న సిస్టర్ దగ్గరికి కూడ వెళ్ళి రావాలి. యిప్పుడు భూమి చాల వరకు బాగు పడిందని అందరూ అనుకుంటున్నారు.'

గౌతమ్ అశ్వనిని సమీపించాడు.

అలసినప్పటికీ, ప్రశాంతంగా కనిపిస్తున్న అతడి కళ్ళలోని భావం ఆమెకర్థమైంది. అతడి పెదవులు ఆర్తిగా ఆమె పెదవులతో కలిసాయి.

కొద్ది నిముషాల తరువాత...

హఠాత్తుగా స్పేస్ షిప్ ఒకసారి కంపించింది.

సుఖానుభూతిలో ఉన్న ఆ జంట మొదట్లో దాన్ని పట్టించుకోలేదు.

అయితే సెకనుకన్న తక్కువ వ్యవధిలోనే, షిప్‌లోని డేంజర్ అలారమ్స్ మోగటం మొదలుపెట్టాయి.

గౌతమ్ ఒక్క ఉరుగుతో వెళ్ళి ఒక పానెల్ మీద బటన్స్ నొక్కాడు.

ఎదురుగా ఉన్న స్క్రీన్ మీద 'బ్లాక్ హోల్' అనే అక్షరాలు మెరిశాయి.

తరువాత, ప్రళయ ప్రభంజనంలా అందుబాటులోకి వచ్చిన వాటి నన్నిటిని తనలోకి లాక్కుంటున్న 'బ్లాక్ హోల్' విశ్వరూపం గోచరించింది.

గౌతమ్ శక్తివంతమైన థ్రస్టర్స్‌ను యాక్టివేట్ చేసి షిప్‌ను దూరంగా తీసుకెళ్ళ ప్రయత్నించాడు.

కాని అప్పటికే ఆలస్యమైపోయింది.

స్పేస్‌షిప్ కొంత దూరం వెళ్ళినట్టు వెళ్ళి, తిరిగి రెట్టించిన వేగంతో బ్లాక్ హోల్ వైపుకు సాగిపోతున్నది.

అతడి కళ్ళలో మొదటిసారి భీతి కనబడుతోంది.

'బ్లాక్ హోల్‌లోకి పోయింతర్వాత ఏమవుతుందో!...

డెత్ షోగా వస్తుందో లేక పెయిన్‌ఫుల్‌గా ఉంటుందో!'...

ఒక్కసారిగా అతడి కళ్ళ ముందు పిల్లలు, భూమి మీద అప్తుల రూపాలు గిర్రున తిరిగాయి.

'మార్షియన్ సొసైటీలో తమ మరణానికి కొద్దిసేపు మౌనం పాటిస్తారేమో... తమ పిల్లలు ఆర్ఫన్స్‌గా బతకాల్సిందేనా?'...


ఫోటో సీరియల్స్ స్పెషలిస్ట్
బి.యమ్. ఈశ్వర్
పిల్లలకోసం ప్రత్యేకంగా తయారుచేస్తున్న
ఫోటో సీరియల్
అతి త్వరలో...




అశ్వని చెయ్యి ధైర్యమిస్తున్నట్టుగా అతడి భుజమ్మీద పడింది.

పసిపిల్లవాడిలా ఆమె వంకే చూడసాగాడు.

కాని ఆమె కళ్ళు అతడి వంక చూడటం లేదు.

శూన్యంలోకి చూస్తున్నట్టున్న ఆమె మనో నేత్రం ముందు నిరాకారుడైన భగవంతుడు దర్శనమిస్తున్నాడు.

గౌతమ్‌కు ఆమె పరిస్థితి అర్థం కావటం లేదు.

యింతలో దిక్కులు పిక్కటిల్లేలా భయంకర శబ్దం...

ట్రాన్స్‌పరెంటు డోమ్‌లోంచి దూరంగా దూసుకు వస్తున్న పెద్ద అగ్నిగోళం...

దాని వేగాన్ని అంచనా కట్టడం అతడి వల్ల కాలేదు...

అది ఆస్టిరాయిడ్

'బ్లాక్ హోల్‌ను చేరటానికి ముందే, అది షిప్‌ను సమీపిస్తే తాము భస్మీపటలం అవుతారు.

ఏ విధంగానైనా మరణం తప్పదు.'

అశ్వని కూడ ఆస్టరాయిడ్‌ను చూసింది.

ఒకటి... రెండు... మూడు... సెకను తిరిగి పోతున్నాయి.

కోటి సూర్యుల తేజోరాసి దిక్కులను ప్రకాశవంతం చేస్తూ దగ్ధమైంది.

స్పేస్‌షిప్ అస్తవ్యస్తంగా పల్టీలు కొట్టి, యిద్దరూ షిప్ లోపల చెరొక మూలకు విసిరేయబడ్డారు.

కొద్ది నిముషాల తరువాత తెప్పరిల్లిన గౌతమ్, అశ్వనులకు బ్లాక్ హోల్ వైపుకు దూసుకువెళుతున్న ఆస్టిరాయిడ్ కనిపించింది... స్పేస్ షిప్ బ్లాక్‌హోల్ పరిధికి దూరంగా ప్రయాణం చేస్తున్నది...

"అశ్వనీ!... ఆస్టిరాయిడ్ మనల్ని కాపాడింది. దాని ఫోర్సు వల్ల మనం దూరంగా విసిరేయబడ్డాం... లక్కీగా హీట్ షీల్డ్సు షిప్‌ను భస్మం కాకుండా కాపాడాయి"....

సంతోషంతో అతడికి మాటలు తడబడుతున్నాయి.

"గౌతమ్!... అది ఆస్టిరాయిడ్ కాదు.... భగవంతుడు."

ఆమె కళ్ళు భక్తితో అర్ధనిమీళిత నేత్రాలయ్యాయి.

## కథారచయిత(త్రి)లకో గమనిక:

'జ్యోతి' మాసపత్రికలో ప్రచురణకోసం కథా రచయిత(త్రి)లు పంపిన కొన్ని వేల కథల్లోంచి ఎంపికచేసిన 'కథల జాబితా'ను వచ్చేనెల 'జ్యోతి'లో ప్రచురిస్తున్నామని తెలియజేస్తున్నాం.

-ఎడిటర్